# మీ హృదయమే నా ఇల్లు

ప్రేమ స్వరూపులారా!

మానవ సమాజములో ప్రధానముగా ఉండవలసినది మానవత్వము. ఎన్ని విద్యలు నేర్చినా, ఎంతటి పదవులు ఏలినా, ఎంతటి ధన కనక వస్తు వాహనాదులు ఆర్జించినప్పటికిని మానవతాగుణము లేకున్న ఇవన్నీ నిరుపయోగమే. మానవత్వమనేది మనము అర్థము చేసుకోవటమే ప్రథమ కర్తవ్యము. ఈనాటి మానవుడు ఆకార మానవునివలె గోచరిస్తున్నాడేగాని ఆచరణ విచారములు శూన్యమైనవి. ఆకార మానవునివల్ల లోకానికి ఏమాత్రము ప్రయోజనము ఉండదు. ఆచార విచారములు అత్యవసరమే. ఇట్టి మానవతనే కోల్పోయిన సమాజము, దేహముకూడను అనేక సంస్కారములు పాడు చేసుకోవలసి వస్తుంది.

జంతూనాం నరజన్మ దుర్లభమ్. ఇట్టి పవిత్రమైన మానవ జన్మ మనకు ప్రాప్తించియు దీనిని సరియైనరీతిగా వినియోగించుకొనలేకపోయిన, దీనిని సరిగా అర్థము చేసుకోలేకపోయిన మన మానవత్వమే వ్యర్థమై పోతుంది. కనుక మానవునిగా జీవించి, మానవునిగా జన్మించి, మానవునిగా ప్రవర్తించటము మన ప్రధాన కర్తవ్యము. పశువు పశువుగా జన్మించి పశువుగా ప్రవర్తించటము అది దాని సహజము. కాని మానవునిగా జన్మించి పశువుగా ప్రవర్తించటము దీనికి విరుద్ధమైన మార్గము. కనుక మానవునిగా జన్మించినవాడు మానవునిగా ప్రవర్తించి మానవునిగా దివ్యత్వాన్ని అనుభవించి దైవత్వములో అంకితము కావటం ప్రధాన కర్తవ్యము. ఇదియే లక్ష్యము.

అయితే ఈనాటి మానవుడు ఇంతవరకు యోచించటానికి ప్రయత్నించటం లేదు. మానవుడంటే ఏమిటో కూడను అర్థము చేసుకోవటం లేదు. మానవతా గుణములంటే ఏమిటో విచారించటం లేదు. కారణము ఈ భౌతికమైన, లౌకికమైన, తాత్కాలికమైన క్షణభంగురమైన విషయములకు లోబడి దివ్యమైన పవిత్రమైన నవ్యత్వమైన ఆత్మతత్త్వమును కేవలము విమర్శిస్తూ

sri sathyasai vahini amrutam

ఉంటాడు. ఇవన్నీ భౌతికమైన సుఖసంతోషములు తాత్కాలికములు. ఇవి అశాశ్వతములు. మానవ సమాజములో ప్రేమ బీజములు పెంచి సహన ప్రసూనములు వికసింపజేసి శాంతి ఫలములు సమాజమున కందించుటయే మానవునియొక్క ప్రధాన లక్ష్యము. కనుక ఈనాడు మానవ సమాజములో శాంతి భద్రతలు క్షీణించిపోయినవి. శాంతి అంటే ఏమిటో కూడను తెలుసుకోలేని జీవితము అయిపోతున్నది. కనుక శాంతి అనేది బయట ప్రపంచములో లేదు. శాంతి అనేది మన హృదయములోనే ఉంటున్నది. ఈ హృదయములో ఉండిన శాంతిని మనము అనుభవములో అందించుకోవటానికి కొన్ని మానవతా గుణములు అలవరచుకోవాలి. మానవతా గుణములు లేకపోతే మానవత్వము అనేది కేవలము విలువలేనిదిగా మారిపోతుంది.

ప్రేమస్వరూపులారా! సమాజమునకు మనకు ఉండిన సంబంధము ఏమిటి? సమాజము నిమిత్తమై మనము ఎందుకు పాటుపడాలి. సమాజముయొక్క క్షేమము కోసము ఎందుకు ప్రార్థించాలి అని విచారణ చేస్తే మనము పుట్టునది పెరుగునది జీవించునది కడపటికి అంత్యమొందునది సమాజమునందే. సమాజము లేక క్షణమైనా మనము జీవించటానికి వీలుకాదు. సమాజముతో మనకు సన్నిహిత సంబంధ బాంధవ్యము పెంచుకొన్నప్పుడు సమాజక్షేమాన్ని సమాజముయొక్క అభివృద్ధిని మనము కోరటం మన కర్తవ్యము. కేవలము నేను నేను అనిస్వార్థము స్వప్రయోజన నిమిత్తమై జీవితమును అంకితము చేయరాదు. స్వార్థ స్వప్రయోజనములకు అతీతమైన ఉన్నతస్థాయి కూడా ఉన్నది. అదియే సమాజము. నేను అనే వ్యక్తిత్వమునుండి సమాజములో ప్రవేశించాలి. సమాజమనే స్థానమునుండి దేశమనే దాంట్లో వ్యాప్తి గావించాలి. విశాలమైన హృదయము వ్యాప్తి గావించుకొనే తత్త్వము మానవునికి అత్యవసరము. ప్రేమ, దయ, సహనము సానుభూతి, త్యాగము ఇవియే మానవతా గుణములు.

## ప్రేమను పెంపొందించుకోండి

మానవునికి రెండు ప్రధానమైన అంగములుంటున్నవి. ఒకటి శిరస్సు. రెండవది హృదయము. శిరస్సు బాహ్యమైన లౌకికమైన ప్రాకృతమైనటువంటిది. విషయములందు అభిరుచిని అభివృద్ధి పరచుకుంటుంది. పదవులు కావాలి. విద్యలు కావాలి. భోగములు కావాలి. సిరిసంపదలు కావాలి. వీటినన్నింటిని ఆశిస్తుంటే ఇవన్నియు ప్రాకృత సంబంధమైనవి. ఇవన్నీ

sri sathyasaivachanamrutam

కదలిపోయే మేఘముల వంటివి. ఏ విధముగా మనకు ప్రాప్తిస్తున్నాయో అదేవిధముగా తిరిగి అంత్యమైపోతున్నాయి. ఈ జగత్తులో శాశ్వతమైన దేశముగాని, శాశ్వతైన విషయముగాని, శాశ్వతమైన పదార్థముగాని మనకు కానరాదు. ఎప్పుడు మార్పు చెందుతూనే ఉంటున్నది. పుట్టిన బిడ్డను పసిబిడ్డ అంటాము. పది సంవత్సరముల తరువాత పిల్లవాడు అంటాము. అదే ముప్పై సంవత్సరములైతే ఒక మనిషి అంటాము. అదే డెబ్బై సంవత్సరములైతే తాతగారు అంటాము. కనుక ఇవన్నీ ఎంత మార్పులు చెందుతున్నవి. కాలక్రమేణా దేశకాల పరిస్థితుల ప్రభావము చేత మానవత్వము ఎన్నియో మార్పులు చెందుతుంది. ఈ మార్పు చెందే దానికి, కూర్పు చెందేదానికి ప్రాకులాడనక్కరలేదు. కనుకనే ఈ ప్రాకృతమైన దానిని ఆశించటమే తలయొక్క ప్రధాన కర్తవ్యము. కాని హృదయము అట్టిది కాదు. తలప్రకృతిని ఆశిస్తే హృదయము నివృత్తిని ఆశిస్తుంది. ఈ నివృత్తి యొక్క తత్త్వమే ప్రేమ, దయ, త్యాగము, సహనము, సానుభూతి ఇలాంటి పవిత్రమైన గుణములు హృదయమునుండి ఆవిర్భవిస్తాయి. హృదయమునుండి ఆవిర్భవించినప్పుడే మనలో ప్రేమ అభివృద్ధి నొందుతుంది.

ఎక్కడ ప్రేమ అభివృద్ధి పొందునో అక్కడే మనకు భయము ఉండదు. ఎక్కడ మనకు భయము ఉండదో అక్కడే మనకు శాంతి లభిస్తుంది. కనుకనే మనకు విశ్వాసము అత్యవసరము. మానవునకు శ్వాసము ఎంతప్రధానమో జీవితమునకు ఆత్మవిశ్వాసము అంత అవసరము. ఆత్మవిశ్వాసము లేకపోవటం చేతనే భయము మనలను తరుముకు వస్తున్నది. భయమనేది మనకు పోవాలంటే అభయము మనకు కావాలి. అభయము ఉండినప్పుడు భయము మనలను ఏమాత్రము బాధించదు. ఈనాడు ప్రతి విషయమునందు లోకములో భయము భయము. ఈ భయమనేది ఆత్మవిశ్వాసము లేకపోవటంచేతనే మనలను బాధిస్తున్నది. ఆత్మ విశ్వాసము కావాలి. అదే self confidence. మనకు ఆత్మ విశ్వాసము ఉండినప్పుడే మనకు ప్రేమ సహజముగా ఆవిర్భవిస్తుంది.

ఒక చిన్న ఉదాహరణము. ఈమె నాతల్లి అనే విశ్వాసము ఉండినప్పుడే ఆ తల్లిని నీవు ప్రేమిస్తావు. ఈమె నా భార్య అనే విశ్వాసము ఉండినప్పుడే నీవు ఆ భార్యను ప్రేమిస్తావు. వీడు నా కుమారుడు అనే విశ్వాసము ఉండినప్పుడే నీవు ఆ కుమారుని ప్రేమిస్తావు. నిజముగా

sri sathyasaivachanamrutam

విశ్వాసమే లేకపోతే నీవు ప్రేమించవు. కనుక మొట్టమొదట విశ్వాసమనేది అభివృద్ధిగావించినప్పుడే ప్రేమ నీలో ఆవిర్భవిస్తుంది. ప్రేమ ఎప్పుడు ఆవిర్భవించునో అప్పుడే మనకు శాంతి చేకూరుతుంది. శాంతి చేకూరినప్పుడే సత్యము మనకు అర్థమవుతుంది. సత్యమును అర్థము చేసుకున్నప్పుడే ఆనందము లభిస్తుంది. ఆనందము చేతనే దైవత్వము మనకు ప్రాప్తిస్తుంది. కనుక నిత్యానందం పరమ సుఖదం అని ఆనందమును ప్రధానముగా పెట్టారు. మానవుని లోపల ఐదు కోశములుంటున్నవి. అన్నమయకోశము, ప్రాణమయకోశము, మనోమయకోశము, విజ్ఞానమయ కోశము, ఆనందమయకోశము. కాని ఈనాటి మానవుడు అన్నమయకోశము వరకు మాత్రమే ప్రయాణము చేస్తున్నాడు. దేహము నాది నాది అంతా నాది నాది అనుకొంటూ. ఈ దేహమును ఆధారము చేసుకొని ప్రతి విషయమునందు కూడను తానుప్రవేశిస్తున్నాడు. దేహము కేవలము నీటి బుడగ వంటిది. ఎప్పుడిది క్షీణించునో, ఎప్పుడిది అంత్యమెందునో, ఎప్పుడిది రాలిపోవునో, ఎప్పుడిది కూలిపోవునో, ఎప్పుడిది కాలిపోవునో ఎవ్వరూ కూడ చెప్పలేరు.

**శత వర్షములదాక మితము చెప్పిరిగాని**
**నమ్మరాదామాట నెమ్మనమున**
**బాల్యమందో మంచి ప్రాయమందో లేక**
**ముదిమియందో లేక ముసలియందో**
**ఊరనో అడవినో ఉదక మధ్యంబునో**
**ఎక్కడో విడిచేది ఎరుకలేదు.**

అలాంటి నీటి బుడగవంటి ఈ దేహమును మనము ఆధారము చేసుకొని తద్వారా నిత్యసత్య నిర్మలమైన ఆత్మతత్త్వమును మనము విస్మరించటము మనకు కర్తవ్యము కాదు.

**ప్రేమ లేకపోతే ప్రాణమే లేదు**

ప్రేమస్వరూపులారా! ముఖ్యముగా మానవత్వమునందు ఇలాంటి పవిత్రమైన అవతారములు వచ్చినప్పుడు మనము సరియైన మార్గమును అనుసరించి ఆచరించి ఆనందించి పదిమందికి పంచుటకు తగిన కృషి చెయ్యాలి. ప్రేమ ప్రధానమైనది. ప్రేమలేక ప్రాణమే లేదు.

srisathyasaivachanamrutam

ప్రతి మానవునియందు ప్రేమ ఉన్నది. కానీ ఆ ప్రేమను అనేక మార్గములలో ప్రసరింప చేసుకుంటున్నాడు. భార్యాభర్తల ప్రేమను మోహము అంటారు. తల్లిబిడ్డల ప్రేమను వాత్సల్యమంటారు. మిత్ర బంధువుల ప్రేమను అనురాగమంటారు. పదార్థముల ప్రేమను ఇచ్ఛ అంటారు. పరమాత్మ ప్రేమనే భక్తి అంటారు.

ప్రేమ ఒక్కటే కదా! కనుక ఈ ఒక్కప్రేమను అనేక మార్గములుగా పోతున్నది. మనము నీరును అక్కడ పెట్టినప్పుడు హిందీ వారు వచ్చి పానీ అంటారు. ఇంగ్లీషు వారు వచ్చి వాటర్ అంటారు. తమిళవారు వచ్చి తన్ని అంటారు. తెలుగు వారు వచ్చి నీరు అంటారు. కాని పదార్థము మారలేదు కదా. ఉన్నది ఒక్కటే ఈ అనేక రకముల భాషలవలన అనేక పేర్లుగా మనము పిల్చుకుంటున్నాము. కనుక ప్రేమ ఒక్కటే. ఆ ప్రేమయే దైవం. ఈ దైవమంటే ప్రత్యేకముగా మనము వెతకనక్కరలేదు. మనదేహములో ఆత్మతత్త్వమనేది ప్రేమనుండి ఆవిర్భవించినది. ఆ ప్రేమ ఒక్కటి మనలో ఉన్నదంటే దైవ మందిరముగా మారిపోతుంది దేహము. ఎంతవరకు భగవన్నామము మనము ఉచ్చరిస్తామో అంతవరకు దేహోదేవాలయ ప్రోక్తో. ఈ దేహము దేవాలయము. దేవాలయమని ఎందుకంటున్నాము. అక్కడ ఏదైనా దేవుడుంటేనే కదా దేవాలయమంటాము. అదే రీతిగా మన దేహము లోపల ఆత్మ అనే దేవుడున్నాడు. ఈ ఆత్మనుండి ఆవిర్భవించినదే ప్రేమ. అదే పరిశుద్ధమైన ప్రేమ. అదే పవిత్రమైన ప్రేమ. దీనిని వేదాంతమునందు నిర్గుణం నిరంజనం సనాతనం నికేతనం నిత్యశుద్ధ బుద్ధ ముక్త నిర్మల స్వరూపిణం. ఇన్ని వర్ణనలు చేశారు. ఇట్టి పవిత్రమైన ప్రేమతత్త్వాన్ని ప్రతి మానవునియందు అభివృద్ధి చేసుకోవాలి.

ప్రేమ ఉండినప్పుడు దేశమంతను ఒక్కరీతిగా మారిపోతుంది. కనుకనే మానవత్వము లోపల తనను తాను నిగ్రహించుకో కలిగినవాడే ఇతరులను నిగ్రహించగల శక్తితనయందు ఆవిర్భవిస్తుంది. కనుకనే దీనిని సంస్కృతమునందు దమము అన్నారు. ఇంద్రియ నిగ్రహము అత్యవసరము. ఈ దమమును మనము సాధించినప్పుడు మనము ఎంతైనా సాధించవచ్చు. కనుక వీనినే దాంతుడు అన్నారు. ఎవడు ఇంద్రియములను నిగ్రహించినవాడో వాడు దాంతుడు. మనము వేదాంతులు కానక్కరలేదు దాంతులైతే చాలు. అలాంటి పవిత్రమైన భావాల్ని

sri sathyasai vahini vacharamrutam

ప్రేమద్వారానే పెంచుకోవాలి. ప్రేమ ద్వారానే ప్రవర్తించాలి. ప్రేమద్వారానే మన జీవితమును అంత్యము గావించుకోవాలి. ఇదే నిజమైన భక్తి.

భక్తి అని అంటే కేవలము పూజలు చేయటము, జపములు చేయటము, ధ్యానములు చేయటము, యోగములు చేయటము, క్రతువులు చేయటము ఇవి కాదు. ఇవి సత్కర్మలని చెప్పవచ్చును. నిజముగా ప్రేమనే మనకు లేకపోతే ఇవన్నీ చేసి ఏమి ప్రయోజనం చెప్పండి. ఇవన్నీ నిరుపయోగము. కుంభవర్షము కురుస్తున్నప్పుడు కుండలు బోర్లవేసి పెడితే ఒక్క చుక్కైనా అందులో చేరదు. కాని దాని మూతిని వర్షమువైపు తిప్పినప్పుడు కొంత జలమైనా అందులో చేరుతుంది. అదేరీతిగా ప్రేమ అనేది మన హృదయమున చేర్చినప్పుడు ఎంతైనా మనము ఆనందించవచ్చు. మన జన్మ సార్థకము చేసుకోవచ్చు. జన్మ సార్థకమంటే ప్రత్యేకమైన పరిశ్రమ కాదు. ప్రేమతత్త్వము పెంచుకోటం.

ప్రేమతో మనము ఎంతైనా సాధించవచ్చు. జ్ఞానము జ్ఞానమంటారు ఏమిటి జ్ఞానము. ఐదురకాల జ్ఞానములుంటున్నాయి. ఒకటి గ్రంథపరిచయము. పుస్తకాలు చదువుతాము. పుస్తకాలలో ఉన్న విషయాలన్నింటిని మస్తకములోనికి చేర్చుకుంటాం. మస్తకము పుస్తకము రెండూ ఒకటే అయిపోతుంది. ప్రయోజనం ఏమిటి? ఆ పుస్తకములో చదివిన విషయమును మాటలతో మనము చెప్పవచ్చు. చెప్పినంత మాత్రమున ప్రయోజనము ఏమిటి? మాటలతో ఏమాత్రము మనసు మారదు. ఐతే దానిని ఆచరణలో పెట్టాలి. అంతో ఎంతో అమృతమైనా నోట్లో పోసుకుంటే పవిత్రత వస్తుందిగాని అట్లు కాకుండా ఎక్కడో కడవలు కడవలు అమృతమంతా పెట్టిఉంటే మనకు తీరేది ఏమిటి? దాహము తీరదు. దాహము తీరాలంటే మన వాంఛలు నెరవేరాలంటే భగవత్ప్రేమను పెంచుకోవాలి బంగారు. ద్వేషముతో ఏమాత్రము మనము సాధించరాదు. ఈ ద్వేషమనేది భగవంతుని నుండి దూరము చేస్తుంది. ద్వేషము, అసూయ, ఆడంబరము, అహంకారము ఇవన్నీ ఆత్మతత్వానికి విరుద్ధమైన శక్తులు. ఇవి మనలో ఉండరాదు. ఇవన్నీ పశుత్వమునకు లక్షణాలు.

**ధర్మమునకు మించినది లేదు**

నిజముగా మానవునికి ప్రేమ, దయ, సహనము, సానుభూతి ఇలాంటివి ఉండాలి.

srisathyasaivahini.org

సత్యంనాస్తి పరోధర్మః, ధర్మమునకు మించినది మరొకటి లేదు. ధర్మమంటే ఏమిటి? కేవలము నీఇష్టము వచ్చినట్టు చేయటం ధర్మంకాదు. త్రికరణ శుద్ధి అనే ధర్మం. మనసులో నీవు తలచినది మాటలో చెప్పు. మాటలో చెప్పినదానిని క్రియలో ఆచరించు. ఈ మూడింటి ఏకత్వమే నిజమైన ధర్మము. మనసులో ఒకటి తలచటము, మాటలో మరొకటి చెప్పటము, క్రియలో మరొకటి ఆచరించటము ధర్మముకాదు. మనస్యేకం, వచస్యేకం, కర్మణ్యేకం మహాత్మనం, మహాత్ముల యొక్క తత్త్వము ఈ మూడింటి ఏకత్వము. మహాత్ములయొక్క తత్త్వము ఎవ్వరు అర్థము చేసుకోలేరు. బంగారూ! దైవముయొక్క తత్త్వాన్ని కించిత్తైనా మనము అర్థము చేసుకుంటే ఎంతైనా జన్మసార్థకమవుతుంది. ఎన్నో మనము చేయనక్కరలేదు. ఎన్నో మనము చూడనక్కర లేదు. సేవాభావముతో అందరిని మనము ప్రేమించినప్పుడు అంతకంటె వేరే మంచిమార్గము లేదు. భగవంతుని సమీపమునకు చేరటానికి సరియైన రాజబాట ఒక్కటే. Love all, Serve all. అందరిని ప్రేమించు. అందరికీ సేవలు చేయి. దాంతోనే మనకు సుఖము ఉంటున్నది. సేవద్వారా ఎంతైనా మనము సార్థకము గావచ్చును. అందువలననే సేవ చాలా ప్రధానమైనది. సమాజసేవలో మనము పాల్గొనాలి. ప్రతి మానవునియందు భగవంతుడు ఉన్నాడు. ఎవరికి సేవచేసినా భగవంతునికి సేవ చేసినట్లే. సర్వజీవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి. ఎవరికి నమస్కారము చేసినా భగవంతునికే చేరుతుంది. అదేవిధముగనే సర్వజీవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి. ఎవరిని మనము తిట్టినా మనము భగవంతుని తిట్టినట్లే. ఈ రెండింటిని మనము పెట్టుకోవాలి.

కనుకనే భగవద్గీతయందు ప్రధానమైన తత్త్వము రెండే రెండు వాక్యములలో చెప్పవచ్చు. ఏమిటది. సంశయాత్మా వినశ్యతే. సంశయమును మనము దూరము చేసుకోవాలి. ఇది అష్టాక్షరి మంత్రము. సం-శ-యా-త్మ-వి-న-శ్య-తే. అష్ట అక్షరములు. ఇది ఒకవైపున గట్టుగా పెట్టుకోవాలి. ఇంకొక వైపున శ్రద్ధావాన్ లభతే జ్ఞానం. ఇది అష్టాక్షరములే. శ్ర-ద్ధా-వా-న్-ల-భ-తే-జ్ఞా-నమ్. ఒకవైపున శ్రద్ధ ఒకవైపున నిస్సంశయము ఈ రెండింటిని గట్టుగా పెట్టుకున్నప్పుడు మన జీవితమనే ప్రవాహము నేరుగా పోయి అనుగ్రహమనే సాగరములో చేరిపోతుంది. ఏమీ సందేహించ నక్కరలేదు. ఇలాంటి దివ్యమైన, నవ్యమైన భావము మన చెంతనే, మనఇంటనే, మనకంటనే ఉండి కూడను మనము అర్థం చేసుకోలేక

sri sathyasai vachanamrutam

పోతున్నాము.

నిజముగా మానవత్వమనేది ఎంతో పవిత్రమైనది. దాని విలువ మీరు తెలుసుకోటానికి ప్రయత్నించండి. ఈ విధమైన దానిని కేవలము మాణిక్యము వంటి మానవత్వమును మసిబొగ్గులకు అమ్ముకోటం మానవత్వానికి సార్థకం కాదు. బంగారూ! ప్రేమతో మన జీవితాన్ని సాధించాలి. అందరియందు మనము సహన భావము పెంచుకోవాలి. సోదర భావమును పెంచుకోవాలి. ఎవరికి ఏ చిక్కులు కలిగినా మనము సాధ్యమైనంత వరకు సేవలు చేయటానికి కంకణం కట్టుకోవాలి. ఇదే స్వామియొక్క ప్రధానమైన గుర్తు. నేను ప్రేమిస్తాను. అందరిని ప్రేమించమని చెబుతాను. అదే నా ప్రోపర్టీ. నాకు ఇంక ఏ ప్రోపర్టీ లేదు. నాకు ప్రేమనే పెద్ద ప్రోపర్టీ. నా దగ్గరనున్న పెద్ద శక్తి ప్రేమనే. ఎటువంటి ప్రేమ. నిస్స్వార్థమైన ప్రేమ. నేను ఇంతవరకు, 64 సంవత్సరములైంది ఇంతవరకు ఒక్కరిని ఏవిధముగా నేను అడగలేదు. నా చేయి ఇట్లా పోలేదు. నాచేయి ఎప్పుడు ఇట్లానే పోతుంది. నేను అడిగేది ఒక్కటే. ప్రేమ, ప్రేమ. నాకు కావలసింది ఒక్కటే. ఆ ప్రేమ ఒక్కటి ఉంటే ప్రపంచమంతా హస్తగతమవుతుంది. ప్రేమ చేతనే సర్వత్వాన్ని చేరిపోతున్నాము. ప్రేమలేకపోతే ఇంటిలో ఉండినవారు విరోధులైపోతారు. కనుక ప్రేమ ఉంటుంటే అన్ని దేశాలు కూడ ఐక్యమైపోతాయి. ఈనాడు మనము స్వాతంత్ర్యమును సాధించామేగాని ఐక్యతను సాధించలేదు. ఐకమత్యము లేక ప్రయోజనమేమిటి? ఐకమత్యమే జీవితమునకు పునాది. ఐకమత్యము లేకుండా పోవటం చేతనే జీవితము ఛిన్నాభిన్నమైపోతుంది. రాజ్యము కూడను ఛిన్నాభిన్నమైపోతుంది. సమాజమునకు ప్రాణము లేకుండా పోతున్నది. ఈనాడు సమాజమును పోషించి సమాజమును నిలబెట్టి సమాజములో వ్యక్తిత్వమనేది దివ్యత్వమును సార్థకము చేసుకోవాలి.

**నీతి వల్లనే జాతి మనుగడ**

నిజముగా సద్గుణములకు ప్రధానమైనది నీతి. నీతి, నీతి. అదే దీనికి పునాది. నీతిలేక ప్రయోజనము లేదు. నీతిలేని జాతిగా ఉండకూడదు. మానవత్వము నీతిపైన ఆధారపడి ఉంటుంది. ఈ జాతినీతి రెండింటియొక్క ఏకత్వమును మనము చక్కగా అర్థము చేసుకోవాలి. అప్పుడే సరియైన మానవత్వము గుర్తించటానికి వీలవుతుంది. మానవ, మానవ అని పేరు

sri sathyasai vachanamrutam

పెట్టుకొని పోతున్నాము. నేను మానవుడనంటే పూర్ణత్వము కాదిది. చక్కగా గుర్తించుకోండి. నేను మానవుడనుకోటం అర్ధము సత్యమే. ఇంకొక అర్ధ సత్యమేమిటి? నేను పశువు కాదు. నేను మానవుడను పశువును కాదు. రెండు చేరినప్పుడే నిజంగా మానవుడైపోతావు. నేను మానవుడను మానవుడననుకొని పశువుగా ప్రవర్తించవచ్చు. కాబట్టి ప్రక్కనే నేను పశువునుకాదు. ఈ రెండింటిని తీసుకున్నప్పుడే పూర్ణమానవుడౌతాడు. ప్రతివాడు నేను మానవుడననుకోటం అర్ధసత్యము. నేను మానవుడను. నేను పశువునుకాదు ఈ రెండింటిని చేర్చినప్పుడే ఏకత్వము. నెగిటివ్ పొజిటివ్ రెండు చేరితే కరెంటు ఏవిధముగా ఉపయోగపడుతుందో అదే విధముగా ఈరెండింటిని ఏకము చెయ్యాలి. ఈనాడు అందరు నేను మానవుడను, నేను మానవుడను అని చెప్పుకొని పోతున్నారేగాని పశువుగా ప్రవర్తిస్తున్నారు. అది మంచిదికాదు. పశువు పశువుగా ప్రవర్తించటము సహజము. మానవుడు పశువుగా ప్రవర్తించకూడదు. ఇది మనము నేర్చుకోవలసినది. మా-న-వ మూడక్షరములు. మా అనగా అజ్ఞానము. న అనగా లేకుండా వ అంటే వర్తించటము. ఇది నిజమైన మానవత్వము. మానవ మా అంటే కాదు. నవ అంటే క్రొత్త. నేను కొత్తవాడిని కాదు. నేను ఎప్పుడు పాతవాడినే. ఎట్లా భగవంతునికి సన్నిహిత సంబంధుడను పాతవాడినే. చాలాపాతవాణ్ణి. మనం పాతవాడినని చెప్పుకుంటూ రోతవారుగా తయారైపోతున్నాం. అది సరియైనది కాదు. పాతవారము. భగవంతుని సన్నిహిత సంబంధ బాంధవ్యముతో కూడిన వారము.

ఇలాంటి భావమును పెంచుకుంటే ఈర్ష్య అసూయ డంబము ఇలాంటి గుణములు వస్తాయి. వచ్చిన కూడను దానిని అరికట్టుకోటానికి తగిన కృషి చెయ్యాలి. కారు ఎంతో స్పీడుగా పోతుంటాది. అవసరమైన చోట బ్రేకువెయ్యాలి. బ్రేకు వెయ్యకపోతే ప్రమాదము జరుగుతుంది. అదే రీతిగానే కోపం వస్తుంది. ద్వేషము వస్తుంది. అసూయ వస్తుంది. కాని దానిని నిగ్రహించుకోవాలి. అదే మానవత్వానికి తగినది. మనసు కలవాడు మానవుడు. చూశారా! పశువుకు మనసులేదు. మనసు నుంచి వచ్చిందే మనిషి. మనస్సు లేక మనిషి లేడు. కనుక మనిషి అంటే ఏమి? మనసే. మనసంటే ఏమి? మనిషే మనస్సంటే సంకల్ప వికల్పములే. సంకల్పవికల్పములే. సంకల్పములయొక్క ఫలితమే చర్యలు. చర్యలయొక్క మంచి చెడ్డలే మన జీవితముయొక్క సుఖదుఃఖములు. చూశారా! కాబట్టి మన కష్టసుఖములన్ని దేనినుంచి

srisathyasaivachanamrutam

వస్తున్నాయి. మన చర్యల నుంచి, చర్యల నుంచి వచ్చిన ఫలితమే. మననడత మంచిగా ఉండాలి. నడత మంచిగా ఉండినప్పుడే మన జీవితము మంచిగా ఉంటుంది. ఈ నడతను సరైన రీతిలో ఉంచుకోటానికి నీతికావాలి. నత యితి నీతిః అన్నారు. నత అనగా మానవత్వము నుండి సంప్రాప్తమైనది నీతి. ఈ నీతి లేని జాతి కాకూడదు మనము.

మానవజాతిని సరియైన రీతిలో పోషించుకోవాలి. ఏమతము ఎవరి దైనప్పటికిని మనమంతా ఒకటిగానే భావించుకోవాలి. అన్ని మతములు ఒక్కటే.

**మతములన్నియుచేరి మంచినే బోధించె**
**తెలిసి మెలగవలయు తెలివితోడ**
**మతులు మంచివైన మతమేది చెడ్డది**

ఏమతము చెడ్డదికాదు. మనమతులే చెడ్డవైపోతున్నాయి. క్రిష్టియన్ మతమనుకోండి, ముస్లిమ్ మతమనుకోండి వారు ఏవిధంగానైనా పోనీ మనమతమును మనము గౌరవించుకోవాలి. ఇంకొకరితో ద్వేషము మనకక్కరలేదు. మనదాన్ని మనం చూసుకు పోతుంటే బయటవారితో మనకెందుకు. అట్లుకాకుండా తనదాన్ని తాను వదలిపెట్టి బయట దానిపైన సవారు చేస్తే ఇది ఎవ్వరుకూడను ఒప్పుకోరు. కనుక మొట్టమొదట మన హృదయాన్ని చూసుకోవాలి. నీఆకలికి నీవు తిను. ఎవరి ఆకలికో నీవు తింటే నీ ఆకలి తీరదు. నీ బాధలకు ఇంకొకరు మందుతింటే నీబాధ నివారణ కాదు. అదే self relation అన్నారు. తనను తాను తెలుసుకోవాలి.

**సేవను మించినది లేదు**

నేను ఎవరు? ఒక చిన్న ఉదాహరణము ఇదినాదేహము, నా మనస్సు, నా బుద్ధి, నా చిత్తము, నా ఇంద్రియము, నా అంతఃకరణ అంటున్నావు నేను ఎవరు? ఎవరైనా యోచిస్తున్నారా? నాదేహము అంటున్నారేగాని దేహమే నేను అనటంలేదే. ఇది నా దేహము అనుకుంటే నేను వేరు దేహము వేరు. ఇది నాకర్చీఫ్. కర్చీఫ్ వేరు నేను వేరు. ఇది నా ఛైర్, ఛైర్ వేరు నేను వేరు. అదే రీతిగా నాదేహమనుకుంటే దేహము వేరు నేను వేరు. నేనెవరు? ఈ నేనెవరనేది ఎవరూ విచారించటం లేదు. కాబట్టి మనస్సు, బుద్ధి, చిత్తము, అంతఃకరణ ఇవన్నీ పనిముట్లు. కరణములన్నింటికిని అధికారి నీవు. నీవు అధికారి కావాలి. నీవు అధికారి

కావాలిగాని బానిసకాకూడదు. నీవు మాస్టర్ కావాలి. మనసును అనుసరించినప్పుడు నీవు చెడిపోతున్నావు. బుద్ధిని అనుసరించినప్పుడే మనము బాగుపడతాం. బుద్ధికి విచారణాశక్తి ఉంది. మంచి చెడ్డ విచారణ చేసి మనము అందులో ప్రవేశిస్తే మనము మానవత్వమును అర్థము చేసుకోవచ్చు.

దివ్యాత్మ స్వరూపులారా! ప్రేమతత్వాన్ని పెంచుకోవాలి. ప్రేమ మనకు పెరగాలంటే సమాజములో ప్రవేశించాలి. సేవలు చెయ్యాలి. ఒక గుడికి పోయి దేవుని ప్రార్థించటం కాదు. లేక పెద్దలకు నమస్కారము చేసి దర్శించి స్పర్శించి వచ్చినంత మాత్రమున కాదు. అందరియందు దైవమున్నాడు. దేహమే దేవాలయము. మీరందరూ దేవుళ్లే. అందరి హృదయాలు దేవునిమందిరాలే. ఆ భావము పెట్టుకోవాలి. ఆవిధముగా ఉన్నప్పుడు నీవే విధములైన చెడ్డపనులందు ఏమాత్రము ప్రవేశించవు. ఆ విశ్వాసము పెంచుకోవాలి బంగారు. భగవంతుడనగా వేరేమిలేదు. ఎక్కడో దూరము లేదు.

**పాపమన వేరు పరదేశమున లేదు**
**తాను చేయు పనుల దగిలియుండు**
**దేవుడనగ వేరు దేశమందున లేదు**
**తాను చేయు పనుల దగిలియుండు**

దేవుడుగాని, పాపముగాని, పుణ్యముగాని అన్నీ మనలోనే ఉన్నాయి. ఎవరో ఎక్కడనుంచో ఇచ్చేది కాదు. ఇచ్చి పుచ్చుకొనే వ్యాపారము కాదు. ఎవరికి వారే ఆనందము తెలుసుకోవాలి. ఈ ఆనందము వలనే మన జీవితము నిత్యానందముగా మారిపోతుంది బంగారూ. ప్రేమను పెంచుకోండి. ఏ ఒక్క విషయములో కూడను తెలుసుకొని తద్వారా దానిలో ప్రవేశించండి. కేవలము తెలియక పూర్వమే అనవసరమైన మాటలందు మనము ప్రవేశించ కూడదు ఎందుకంటే 'కాలుజారితే కలుగదు నష్టము నోరుజారితే నరకమురా'. కాలుజారి పడితే దెబ్బ తగిలిందని డాక్టరుకు చూపించి బ్యాండేజి కట్టించుకోవచ్చు. మందు వేసుకొని నయం చేసుకోవచ్చు. కానీ నాలుక జారి హృదయానికి గాయమైతే ఏ డాక్టరు నయం చేయగలడు. ఎవరు నయం చేయలేరు. ఎక్కడ దెబ్బతగిలింది ఎవరికి తెలియదు. కనుక మనం మాటలు మాత్రం చాలా శాంతముగా

sri sathyasai vachanamrutam

ప్రేమతో సహనంగా మాట్లాడటం నేర్చుకోవాలి. కఠినమైన మాటలతో హృదయాన్ని మనం బాధించరాదు. అది నా ప్రధానమైన ప్రేమతత్త్వము.

ఈ ప్రేమను అందరు పెంచుకోవాలి. ఆయన చెప్పాడు స్వామియొక్క పవిత్రమైన గుణాలు మా అందరికి అందించాలని. మీలో ఉన్నాయి. అందించేవి కాదిది. మీరు అందుకునేది కాదు. కాని దానిని ఉపయోగించుకోవటం లేదు. మన స్టోర్‌లో బియ్యం ఉన్నాయి. పప్పు ఉంది. చింతపండు ఉంది. అన్నీ ఉంటున్నాయి. కానీ వంట చేసేది మనకు తెలియదు. కనుక వంటవానిపైన ఆధారపడుతున్నాము. చూశారా! పదార్థములంతా మనవే అదే విధముగా అన్నీ మనలో ఉంటున్నాయి. ఉపయోగించుకునే విధానము తెలియదు కనుకనే మనము ఇతరులపైన ఆధారపడి పోతున్నాము. కనుక అట్లు చేయకూడదు. మనం తెలుసుకోవాలి. తెలిసి రామచింతన చేయవే అన్నాడు త్యాగరాజు, మనం తెలుసుకొని చెయ్యాలి. మనలోనే ఉన్నాయి సద్గుణములు. సర్వ సద్గుణములు మీలోనే ఉంటున్నాయి. లేకుండా పోలేదు బంగారూ. ఆ సద్గుణములను సద్గుణములుగానే ఉంచుకోండి. ఎంతైనా శాంతి సుఖములు ఆనందమును అనుభవిస్తారు. ఎంతో శ్రమలకోర్చి, ఎంతదూరమునుండో, ఎంతో ప్రేమతో మీరు రావటం చేతనే నా ప్రేమ మీరు అందుకోవటానికి అవకాశము వచ్చింది. ఇలాంటి సన్నిహిత సంబంధ బాంధవ్యములు కలగాలి. ఒక కట్టకు కొంచెం ఒక దినము కొంచెం రాపిడి జరుగుతే ఆ కట్టముక్కలైపోతుంది. కానీ బాగా రాసుకుంటే దానిలో అగ్ని పుడుతున్నది. చూశారా! కట్ట కట్ట రాపిడి వల్ల అగ్నిపుడుతుంది. అదే జ్ఞానాగ్ని. పెట్రొమాక్సులైటుకు అప్పుడప్పుడు పంపుకొట్టాలి కదా. అదేవిధంగా మీరు అప్పుడప్పుడు ఇక్కడకు వస్తుంటే ఈ పంపు పిన్నులతో బుద్ధి వికాసము చెందుతుంది. ప్రకాశమును పొందుతుంది. ఇది మీ ఇల్లు నా ఇల్లు కాదు. మీ హృదయమే నా ఇల్లు. మీ ప్రేమయే నాసంపద. దాన్ని మాత్రం ప్రధానంగా పెట్టుకొని చక్కగా అర్థం చేసుకొని మీరందరు వర్తించుతారని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నాప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేది. 22-08-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam